క్లుప్తంగా

ఐదు నామినేషన్ల దాఖలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ నియోజక వర్గానికి ఐదు నామినేషన్లు మంగళవారం దాఖలయ్యాయి. బీసీవైపీ నుంచి కాళహస్తి చెంచుమహేష్, సీపీఎం నుంచి మూలం రమేష్, ఇండిపెండెంట్లుగా అవధానం సత్యసాయి, దాసరి గౌతమ్, వేలూరు రంగారావు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లను దాఖలు చేశారు. వీటిని ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్ స్వీకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఏ స్పార్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ ప్రగతి నగర్ ఫీడర్‌లో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతినగర్ ఏ, బీ బ్లాక్‌లు, లేక్‌వ్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేలా డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్దానాయక్ సూచించారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపీ సేవలను ఉదయం తొమ్మిదికి ప్రారంభించి.. సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. రోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. విధులకు గైర్హాజరైనా.. డ్యూటీ మధ్యలో వెళ్లిపోయినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డాక్టర్లు మస్తాన్‌బాషా, గంగాధర్, నరేంద్ర, కళారాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతిగృహాల్లో 86.68 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని బీసీ వసతి గృహాల విద్యార్థులు 86.68 శాతం ఉత్తీర్ణత సాధించారని బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 631 మంది హాజరుకాగా, 547 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. వీరిలో 404 మంది ఫస్ట్ క్లాస్.. 93 మంది సెకండ్ క్లాస్.. 50 మంది థర్డ్ క్లాస్‌లో పాసయ్యారని చెప్పారు. 54కు గానూ 18 వసతి గృహాల్లోని విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఆత్మకూరులోని బీసీ బాలికల వసతి గృహానికి చెందిన సాదియా 586 మార్కులను సాధించిందన్నారు.

ఘనంగా పుస్తక దినోత్సవం

నెల్లూరు(అర్బన్): పిల్లల్లో మనోవికాసం, నైతిక విలువలను పెంపొందించేందుకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి పేర్కొన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని కరెంటాఫీస్ సెంటర్‌లోని వెంకటేశ్వర విద్యాలయంలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బాలసాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్ రచించిన దేవతల కథలు, నీతి కథల పుస్తకాలను పిల్లలకు బహుమతులుగా అందజేశారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నెల్లూరు(బృందావనం): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పూజలను కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా అల్లాడి సుబ్రహ్మణ్యం దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని నర్తకి సెంటర్‌లో పలు పుస్తకాలను ప్రజావేదిక అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో జయప్రకాష్, మహేష్, షఫీ, శ్రీనివాస్, బుచ్చయ్య, మస్తాన్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు సభ

నెల్లూరు(అర్బన్): కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కేకును ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు కట్ చేయించారు. ఉపాధ్యాయులు హరీష్, రాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(బృందావనం): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా విజయకుమార్‌రెడ్డి, వాణి మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, శైలజ దంపతులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా..



దేవరపాళెంలో ప్రచారం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: తానెక్కడ ప్రాతినిధ్యం వహిస్తే, ఆ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దేవరపాళెంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో ఎంతో మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సుధాకర్‌యాదవ్, నెట్టెం శ్రీధర్‌నాయుడు, వేమిరెడ్డి ఆనందరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వేమిరెడ్డి కౌసల్యమ్మ, వేమిరెడ్డి అరవింద, సుధ, పల్లంరెడ్డి శేషురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఆదాల

వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడికి చెందిన అల్లూరు దినేష్‌కుమార్‌రెడ్డి, మస్తాన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా..



50వ డివిజన్లో ప్రచారం చేస్తున్న నేతలు



52వ డివిజన్లో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ, నెల్లూరు సిటీ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్‌కు మద్దతుగా నగరంలోని 50వ డివిజన్లో విస్తృత ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్, నేతలు శ్రీనివాసరావు, వాజిద్, నిస్సార్, రంగా, జయరామ్, మస్తాన్, వెంకటేష్, కిరణ్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

- 52వ డివిజన్లోని గొల్లవీధి, ఆనకట్టరోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జిలు మహబూబ్‌బాషా, కందుకూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- 54వ డివిజన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డికాలనీ, రైలువీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

'కస్తూరిదేవి' విద్యార్థుల ప్రతిభ



ప్రీతి



సునీత



సంధ్య



జ్యోత్స్న

నెల్లూరు(అర్బన్): పదో తరగతి పరీక్షల్లో నగరంలోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయురాలు వనజ తెలిపారు. 51 మందికి గానూ 40 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ప్రీతి 551, సునీత 548, సంధ్య 512, జ్యోత్స్న 502 మార్కులను సాధించారని పేర్కొన్నారు. వీరిని అభినందించారు.

జగనన్నను మరోసారి సీఎం చేయాలి

నెల్లూరు సిటీ: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 12వ డివిజన్లోని రాజుపాళెం గిరిజన కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతితో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడారు. రానున్న రోజుల్లో అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేలా ఆదాల ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డివిజన్ ఇన్‌చార్జి జయవర్ధన్, కాకుటూరు లక్ష్మీసునంద, ఏపీ స్టేట్ ఎమ్మెస్సెమ్ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, క్లస్టర్ – 1, 4 అధ్యక్షులు ముడియాల రామిరెడ్డి, బెజవాడ మేఘనాథ్‌సింగ్, జేసీఎస్ కన్వీనర్ దారా వంశీ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఆదాల హిమబిందు

ప్రజల నుంచి అపూర్వ ఆదరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయని.. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెప్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత, పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి పేర్కొన్నారు. 51వ డివిజన్లోని కపాడిపాళెంలో కార్పొరేటర్ సాహిత్య, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి కాయల సురేష్, స్థానిక నేతలతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. నెల్లూరు అభివృద్ధికి రూపొందించిన ప్రత్యేక మేనిఫెస్టో ప్రతులను అందించి.. అందులోని అంశాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారానికి వెళ్లిన ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. నేతలు అరవ విజయబాబు, బాలప్రసాద్, సందీప్, సరిత, ప్రమీల, శాంతి, పార్టీ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కర్తం జ్యోతి, వెంకటాచలం హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

'కేకేఆర్స్ గౌతమ్' విజయకేతనం

నెల్లూరు(అర్బన్): పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కేకేఆర్స్ గౌతమ్ ఉప ప్రధానోపాధ్యాయుడు వెంకటకృష్ణ తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని మాగుంట లేఅవుట్లోని పాఠశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. పల్లవిక 591, రాంకీ 589, పూర్విక 588, జయలాస్య 586 మార్కులను సాధించారన్నారు.



కనులపండువగా రథోత్సవం

నెల్లూరు(బృందావనం): సంతపేటలో కొలువైన ఆంజనేయస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువుదీరిన స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. తొలుత నిత్య హోమం, మహానివేదన, బలిహరణ, పుణ్యాహవచనం, స్వస్తివచనం తదితర పూజలను ఆలయ ప్రధానార్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం వివిధ ప్రాంతాల మీదుగా సాగింది. రథంపై ఉప్పు, మిరియాలు చల్లుతూ.. కొబ్బరికాయలు కొడుతూ.. గుమ్మడికాయలతో దిష్టితీస్తూ.. కర్పూర హారతులతో మొక్కులు చెల్లించుకొని భక్తులు ప్రణమిల్లారు. ఉభయకర్తగా గుర్రం ఈశ్వర్ వ్యవహరించారు. ప్రసాద వితరణకు ఉభయకర్తలుగా కోట రమేష్‌బాబు, శ్రీదేవి దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేషాభిషేకాలు

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలను మంగళవారం నిర్వహించారు. అనంతరం గరుడ సేవను జరిపారు. ఉభయకర్తలుగా మన్నెం జీవన్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బృందావనం): నగరానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీని క్రైస్తవ సమాఖ్య వేదిక నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ప్రధాన కార్యదర్శి రెవరెండ్ రాజశేఖర్ దాసరి, స్వరాజ్, క్రాంతికుమార్, జోసఫ్‌బాబు, యాకోబు, రాజేష్, యేసుపాదం, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): నగరంలోని మెడికవర్ హాస్పిటల్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఏఎస్పీ సౌజన్య మంగళవారం రాత్రి పరిశీలించారు. వాహనాలను ఆమె స్వయంగా తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాల్లేకుండా రూ.రెండు లక్షలను అల్లీపురానికి చెందిన నాగరాజు తరలిస్తుండగా, స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్, డీటీసీ ఇన్‌స్పెక్టర్లు వీరానాయక్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మనోహకు మోటివేషనల్ స్పీకర్ అవార్డు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌కు చెందిన మోటివేటర్ దగ్గోలు మనోహకు ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ అవార్డును ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తనకు అవార్డును నల్లగొండ సీనియర్ సివిల్ జడ్జి తేజో కార్తీక్ తదితరులు అందజేశారని ఆయన చెప్పారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. ఏఎస్‌పేట మండలం చౌటభీమవరానికి చెందిన లక్ష్మీనారాయణ, జ్యోతి దంపతులకు కిశోర్ (19), కుమార్తె ఉన్నారు. ఉపాధి నిమిత్తం కొంతకాలం క్రితం నెల్లూరొచ్చిన వీరు శెట్టిగుంటరోడ్డులో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఉన్న సెలూన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని కిశోర్ పోషించసాగారు. ఈ తరుణంలో తెలిసిన వారి బైక్ తీసుకొని నగరంలోకి మంగళవారం బయల్దేరారు. ఫ్లైఓవర్‌పైకి చేరుకునేసరికి బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. కిశోర్ తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని ఎస్సై గీతారమ్య పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మలేరియా రహిత సమాజానికి కృషి చేద్దాం

నెల్లూరు(అర్బన్): మలేరియా రహిత సమాజానికి కృషి చేద్దామని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాధి నిర్మూలనకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2025 నాటికి మలేరియా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డాక్టర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

28న వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): మాగుంట లేఅవుట్లోని అనిల్ గార్డెన్స్‌లో ఈ నెల 28న నిర్వహించనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశ ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. రామ్మూర్తినగర్‌లోని తన కార్యాలయంలో వీటిని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ఆవిష్కరించారు. నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

నెల్లూరు(బృందావనం): చైత్ర పౌర్ణమి, హనుమజ్జయంతిని పురస్కరించుకొని మనుమసిద్ధినగర్‌లోని మాతృశ్రీ భవన్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని టీటీడీ వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయకర్తలుగా తడకపల్లి రవీంద్ర, సుధారాణి.. మణికుమార్, రాజ్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు. బ్రాహ్మణ సేవా సంఘాల సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడ్లదొన వాసుదేవరావు, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, మహిళా విభాగ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మావతి, జయలక్ష్మి, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు దుద్దుకూరు రమేష్ పాల్గొన్నారు.



పేద బ్రాహ్మణ విద్యార్థులకు తోడ్పాటు

ఇంటర్, డిగ్రీలో 80 శాతానికిపైగా మార్కులు సాధించి ఇంజినీరింగ్, పీజీ అభ్యసించాలనుకునే పేద బ్రాహ్మణ విద్యార్థులకు చదువు పూర్తయ్యేంత వరకు స్కాలర్‌షిప్‌ను హైదరాబాద్‌కు చెందిన కామరాజు అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేయనున్నామని గుడ్లదొన వాసుదేవరావు తెలిపారు. కేటరింగ్ చేసుకునే పేద బ్రాహ్మణ కుటుంబాలకు అవసరమైన వంటపాత్రలను అన్నపూర్ణ పథకం ద్వారా అందజేయనున్నామని వెల్లడించారు. వివరాలకు 98487 09424 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆదాలతోనే అభివృద్ధి సాధ్యం



31వ డివిజన్లో ప్రచారం చేస్తున్న నేతలు



ఒకటో డివిజన్లో..

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి ఆదాల ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమని ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌గుప్తా పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 31వ డివిజన్లోని గాదం రోశయ్యనగర్‌లో ప్రచారాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. నేతలు అక్కి చంద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, రమాదేవి, మేకల రాజేశ్వరి, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్రంలో దళితుల ఆశాజ్యోతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రైల్వేబోర్డు సభ్యుడు, దళిత నేత స్వర్ణా వెంకయ్య పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ, నెల్లూరు రూరల్ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఒకటో డివిజన్లోని అంబేడ్కర్‌నగర్‌లో ప్రచారాన్ని నిర్వహించారు. బద్దెపూడి రవీంద్ర, బెల్లంకొండ వెంకయ్య, ఆనందరావు, వెంకట్రావు, శ్రీనివాసులు, యనమల హరియాదవ్, సుబ్రహ్మణ్యం, రత్నం తదితరులు పాల్గొన్నారు.
- 20వ డివిజన్లోని వనంతోపు సెంటర్, కృష్ణానగర్, ఇస్కాన్ సిటీ, కావేరినగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నేతలు పోతురాజు రమాదేవి, ఆరుగుంట రాజారెడ్డి, చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సరళమ్మ, హరిరెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి కోరారు. డివిజన్లోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని ఆమె నిర్వహించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, నేతలు పెంచలనర్సారెడ్డి, రాజారెడ్డి, వెంకటరత్నం, శేఖర్, సాయి, బుజ్జన్న, మాల్యాద్రి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



20వ డివిజన్లో..



21వ డివిజన్లో..

మద్యం అక్రమ రవాణాపై నిఘా

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని ఎస్ఈబీ జిల్లా అధికారి దయసాగర్ పేర్కొన్నారు. ఎస్ఈబీ నెల్లూరు – 2 కార్యాలయాన్ని ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చాక తనిఖీలు, కేసుల నమోదు, నిందితుల అరెస్ట్, సీజ్ చేసిన మద్యం తదితర వివరాలను ఇన్‌స్పెక్టర్ రాగమయిని అడిగి తెలుసుకున్నారు.



వివరాలను ఆరాతీస్తున్న దయాసాగర్

గురుకులాల్లో సీట్ల భర్తీకి 26న కౌన్సెలింగ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 11 సాంఘిక సంక్షేమ గురుకులాలు, అంబేడ్కర్ గురుకులాల్లో ఆరో తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్‌ను ఈ నెల 26న నిర్వహించనున్నామని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న 232 సీట్లకు 1:3 నిష్పత్తితో కౌన్సెలింగ్‌ను జరపనున్నామని వివరించారు. ముత్తుకూరులోని అంబేడ్కర్ గురుకులంలో కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. వివరాలకు సమీపంలోని గురుకులం లేదా డీసీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.